# సుందోప సుందులు

పూర్వము సుందోపసుందులనే అన్నదమ్ములు తమ బలపరాక్రమాలచేత చాలా రాజ్యములు జయించి, గర్వముతో దుష్ట పరిపాలన సాగిస్తూ ఉండేవారు. వారు దేవతలను, ప్రజలను పీడించేవారు. వారి బాధలు సహింపలేక దేవతలు, ప్రజలు శివునికి మొరపెట్టుకున్నారు. అప్పుడు శివుడు వాళ్ళు బ్రహ్మకై తపస్సు చేసి ఎంతటి బలాఢ్యుని చేతిలోనైనా చావు లేకుండా వరాలు పొందిన వైనము వివరించి, శ్రీ మహావిష్ణువేమైనా మీ కష్టాలను కడతేర్చ గలడేమో ప్రయత్నించమని సలహా ఇచ్చాడు. దేవతలు, మునులు కలిసి వైకుంఠానికిపోయి విష్ణువుకు తమ కష్టాలను తెలియజేసారు. విష్ణువు వారికి అభయమిచ్చాడు.

ఒకసారి సుందోపసుందులు వేటకై అడవికి వెళ్ళి, చాలా మృగములను వేటాడి, విశ్రమించిన తరుణాన, వారికి ఒక త్రిలోక సుందరి కనిపించింది. మోహముతో ఆ సోదరులు ఇరువురూ ఆమెను వెంబడించారు. ఆ మోహిని చిరునవ్వులొలికిస్తూ, వారిని తన చూపులతో ఆకర్షించింది. ఆమె అందానికి ముగ్ధులై, ఎవరికి వారు ఆమెను చేపట్టాలని ఉవ్విళ్ళూరసాగారు.

అది గ్రహించిన మోహిని వారిని ఉద్దేశించి, సుందరులారా! మీలో ఎవరినో ఒకరిని నేను చేపట్టడానికి సిద్ధముగా ఉన్నను. మీలో ఎవరు బలవంతులో తేల్చుకుని, గెలిచినవారే నన్ను చేబట్టాలి అని అన్నంతనే, సుందుడు "మనలో నేను పెద్దవాడను. సామ్రాజ్యనేతను. కాన ఈమె నాకు రాణి కావలసి ఉంది" అనీ, ఉపసుందుడు "అలా కాదు, ముందుగా నేనామెను చూసాను, కాన ఆమె నా సొత్తు" అనీ వాదమునకు దిగారు. తుదకు వారిలో వారు కలహించుకొని, వారిరువురూ ఒకరిని మరొకరు పొడుచుకొని మరణించారు. ఆ విధముగా శ్రీమహావిష్ణువు మోహిని రూపములో ప్రజలకు సుందోపసుందులనుండి విముక్తి కలిగించాడు.

లోకములో మిక్కిలి దుర్మార్గులైన అన్నదమ్ములుగాని, మిత్రులుగాని తమలో తామే కలహించుకోవడము తటస్థ పడితే వారిని సుందోపసుందులు అనడము పరిపాటి.

# దొందూ దొందే

ఒక గ్రామములో ఆస్తీ పాస్తీ లేని ఒక పేదకోమటికి కురూపి కొడుకు పుట్టాడు. వాడిది నంగిమాట అవడంచేత వయస్సు వచ్చినా పెండ్లి పేరంటము కాలేదు. గుట్టు మట్టుగా అతి ప్రయత్నముమీద తండ్రి ఒక్క సంబంధం కుదిర్చాడు. పెండ్లి పూర్తి అయ్యేవరకు కొడుకును అదుపాజ్ఞలలో పెట్టి సంజ్ఞలతోనే కాలము గడిపివేసాడు. వివాహము పూర్తి అయినది. వధూవరులు గృహప్రవేశానికై పల్లకీపై వస్తుండగా పురోహితుడు కూడా వారితో వచ్చు చుండెను.

వారి పల్లకీ చింతచెట్ల తోపుమీదుగా సాగుతున్నది. బాగా పూచిన చింతచెట్లు వారికి కన్నుల పండుగ చేసాయి. ఆనందములో తండ్రి ఆజ్ఞ మరచి, పెండ్లికొడుకు ఒళ్ళు తెలియని ఉత్సాహముతో "తింతతెత్లు పూతినాయి తూతినావా?" అన్నాడు పెండ్లికూతురునుద్దేశించి. అంతవరకు ముభావముగా నున్న పెండ్లికూతురు "తూడకేం, పూతేకాలం వత్తే పూతక పో పో పో పోతుందా?" అన్నది.

ఇప్పటివరకు వరునియందే లోపము ఉన్నదని తెలిసికొన్న పురోహితునికి వధువునందుకూడా అదేలోపము కలదని గ్రహించి "గంతకుతగ్గ బొంత దొరికింది. దేవుడు పక్షపాతం ఎంతమాత్రమూ చూపలేదు. ఇకనేం" అనుకుంటూ తనకూ నత్తి ఉండడముచేత "దొందూ దొందే దొద్దప్పా" అంటూ తలయూపాడు. అనగా రెండూ రెండే. వారికి వారే సాటియని వాని భావం కాని నత్తి పురోహితునిగా తాను మూడవవాడినన్న సంగతి మరచిపోయాడు.